సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 13.09.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 314
పేజీలు: 08 వెల: రూ. 5

## మనిషిని ఆలోచింపజేసే శక్తి హిందీ సాహిత్యంలో ఉంది

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

- హిందీ ప్రజలను కలిపే వారధి
- హిందీ సాహిత్యానికి చరిత్ర
- మానవ విలువలను ప్రతిబింబించిన రచనలు
- స్వేచ్ఛా పత్రికే ప్రజాస్వామ్యానికి బలం
- ప్రజల పక్షాన హిందీ పత్రికలు నిలవాలి

03







## అందరినీ తొక్కేస్తా!

### మాక్ అసెంబ్లీలో 'సీఎం' వ్యాఖ్యలు సభ్యుల నవ్వులు




- ఎన్నికల్లో కోట్లు ఖర్చు చేశా..
- మళ్లీ సంపాదించుకోవద్దా
- రెవెన్యూ మంత్రి సీరియస్ కామెంట్స్
- ముఖ్యమంత్రిగా తలసాని, ఆర్థిక మంత్రిగా గంగుల
- నీటిపారుదల శాఖ మంత్రిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి
- విపక్ష నేతలుగా జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి
- స్పీకర్ స్థానంలో మాణిక్ రావు
- తుమ్మిడిహట్టితో ముందుకేనన్న సాగునీటి మంత్రి
- తెలంగాణ భవన్లో ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

**ముద్ర, హైదరాబాద్:**
మీ అసెంబ్లీకి రానీయకపోతే.. మా అసెంబ్లీ లేదా? మాకు అసెంబ్లీ లేదా..? మాక్ అసెంబ్లీ నిర్వహించలేమా? అని అనుకుని ఉంటాడు కేటీఆర్. అందుకే మన తెలంగాణ భవన్‌లో మనమే ఓ మాక్ అసెంబ్లీ నిర్వహించుకుంటే పోలా? అని అనుకున్నదే తడువు.. కానిచ్చేశారు. సీఎంగా శ్రీనివాస్ యాదవ్, స్పీకర్‌గా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ గా పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు నటించేశారు. మంచి కామెడీ పండించారు. నవ్వులు పూయించారు. కాసేపు జబర్దస్త్ కామెడీని తలపించారు.
మొన్నటి దాకా సీరియస్‌గా ఆందోళనలు చేసీ చేసీ అలసిపోయి ఉంటారు. అందుకే కొద్దిసేపు సేద తీరుదామని అనుకున్నట్టున్నారు. ఇలా జబర్దస్త్ జోకులు వేసుకుని వారిలో వారే నవ్వుకున్నారు. జోకులేసుకున్నారు. పాత్రల్లో మిగతా 02లో

## మండపాలకు ఉచిత విద్యుత్

సీఎం రేవంత్ రెడ్డి





- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష
- నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం

02

## న్యూఢిల్లీ డిక్లరేషన్




### బ్రిక్స్ కూటమి ఏకగ్రీవ ఆమోదం

- యుద్ధం కాదు.. చర్చలే పరిష్కారమన్న బ్రిక్స్
- పశ్చిమాసియా సంక్షోభంపై బ్రిక్స్ కీలక నిర్ణయం
- యూఎన్ భద్రతా మండలి సంస్కరణలకు బ్రిక్స్ పిలుపు
- మానవాభివృద్ధే లక్ష్యంగా బ్రిక్స్ కీలక తీర్మానం
- ప్రపంచ శాంతికి దౌత్యమే మార్గం
- ఆర్థిక, డిజిటల్ సహకారానికి బ్రిక్స్ దేశాల అంగీకారం
- ప్రపంచ సమస్యల పరిష్కారంలో బ్రిక్స్ ముందడుగు
- మోదీ పిలుపుతో మానవ సంక్షేమానికి పెద్దపీట
- ఏకతాటిపై బ్రిక్స్.. శాంతి, అభివృద్ధికి సంకల్పం

**ముద్ర, ఢిల్లీ:**
బ్రిక్స్ సదస్సులో చారిత్రక ఘట్టం నమోదైంది. సదస్సులో భాగంగా రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు కూటమిలోని సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతున్న పశ్చిమాసియా సంక్షోభంపైనా సభ్య దేశాల మధ్య స్పష్టమైన ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

యుద్ధం పరిష్కారం కాదు – చర్చలే మార్గం
పశ్చిమాసియా పరిణామాలపై బ్రిక్స్ కూటమి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏ రకమైన సమస్యకూ యుద్ధం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. శాంతిని నెలకొల్పడానికి నిరంతర చర్చలు, దౌత్య మార్గాలే ఏకైక పరిష్కారమని సభ్య దేశాలు తేల్చిచెప్పాయి.

### బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు

గ్లోబల్ సౌత్ ఇక నియమాలు పాటించడమే కాదు




- ప్రపంచ సంక్షోభాలకు బ్రిక్స్ పరిష్కారం చూపాలి
- ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి
- ఐరాస భద్రతామండలిలో సంస్కరణలు తప్పనిసరి
- ఏఐ సదస్సు లో నరేంద్రమోదీ

02

#### 'న్యూఢిల్లీ డిక్లరేషన్'లోని ముఖ్యాంశాలు

**1. పశ్చిమాసియా సంక్షోభం- శాంతి:** పశ్చిమాసియా సంక్షోభం సహా ఎలాంటి అంతర్జాతీయ సమస్యలకైనా యుద్ధం పరిష్కారం కాదని, దౌత్యం, చర్చల ద్వారానే శాంతి సాధ్యమని స్పష్టం చేశారు. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**2. ఐరాస (UNSC) సంస్కరణలు:** మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**3. మానవాభివృద్ధే ప్రాధాన్యం:** భారత్ నేతృత్వంలో ఈ సదస్సు మానవాభివృద్ధే ప్రథమం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించారు.

**4. ఆర్థిక సవాళ్లు, డిజిటల్ సహకారం:** ప్రపంచ సరఫరా వ్యవస్థలను బలపరచడం, ఆహార–ఇంధన భద్రత, స్థానిక కరెన్సీల ద్వారా వ్యాపారాన్ని పెంపొందించడం వంటి ఆర్థిక అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

మిగతా 02లో

## బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

02

మంత్రి శ్రీధర్ బాబు



- మూసీ పునరుజ్జీవానికి రూ.7,345 కోట్లతో తొలి అడుగు
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 400 చిన్న నేరాలను నేరపూరిత పరిధి నుంచి తొలగించే బిల్లు

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా



మంత్రి పొంగులేటి

- వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

02

## ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేస్తాం..

### పేదలకు మెరుగైన వైద్యం.. ఖర్చు తగ్గిస్తాం

**ముద్ర, అమరావతి:**
కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే నెం.1 స్థానం దక్కిందని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. 500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, తద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు గణనీయంగా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సంజీవని ప్రాజెక్ట్ గేమ్ ఛేంజర్‌గా మారబోతోందన్నారు. మిగతా 02లో



- ఏపీ ఆరోగ్య రంగానికి కొత్త ఊపు..
- రూ.64 వేల కోట్లతో బలోపేతం
- 500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు.. పేదలకు భారీ ఊరట
- సంజీవని గేమ్‌ఛేంజర్.. ఆరోగ్య రంగంలో పెనుమార్పులు
- ఏపీలో 24 క్రిటికల్ కేర్ బ్లాకులు.. 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు
- సీఎం చంద్రబాబు

02

## 'ఢీ-10' రాజు అరెస్ట్

### లైంగికంగా వేధించాడని ఓ యువతి ఫిర్యాదు

02



- సినిమా అవకాశాల పేరుతో మోసం చేశాడని ఆరోపణ
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన మియాపూర్ పోలీసులు

## తెలంగాణలో జోరు వానలు



### వారం పాటు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ

- రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కుండపోత వానల అంచనా
- సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ

02

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 13.09.2026
www.mudranews.in | @mudranews



### మలబద్ధకానికి రోజుకు 2 కివీలు



ఒక అధ్యయనంలో రోజుకు రెండు గ్రీన్ కివీలు నాలుగు వారాల పాటు తీసుకున్నవారిలో పూర్తి మల విసర్జనల సంఖ్య మెరుగుపడినట్లు గుర్తించారు. మలబద్ధకం, పొట్టలో అసౌకర్యం తగ్గడంలోనూ ప్రయోజనం కనిపించింది.

## న్యూఢిల్లీ డిక్లరేషన్

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రధాని మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు సదస్సును ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, బ్రిక్స్ కూటమి ప్రయాణంలో ఇది కీలక ఘట్టమని పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమి ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సభ్య దేశాల ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

**ప్రపంచ సమస్యలకు పరిష్కారం**
అంతర్జాతీయ వేదికలపై ఎదురవుతున్న వివిధ సమస్యలు, సవాళ్లకు బ్రిక్స్ దేశాలు ముందుండి కార్యాచరణ ద్వారా పరిష్కారం చూపించాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్ కూటమి వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటూనే, మనం వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని భారత ప్రధాని నొక్కిచెప్పారు.

**ఐరాస భద్రతా మండలి సంస్కరణలు**
మారుతున్న వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి (UN) భద్రతా మండలిలో తక్షణమే సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం లభించడం ద్వారా అంతర్జాతీయ వేదికపై బ్రిక్స్ కూటమి ఏకతాటిపై నిలిచిందని, ప్రపంచ శాంతి, అభివృద్ధి దిశగా బలమైన అడుగులు వేస్తోందని స్పష్టమవుతోంది.



## మండపాలకు ఉచిత విద్యుత్

**ముద్ర, హైదరాబాద్ :**
వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన.. పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు.
దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. 'స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది' అని ఆయన స్పష్టం చేశారు.
చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ.. 'మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. 'హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని సీఎం హామీ ఇచ్చారు.

## అందరినీ తొక్కేస్తా



**(మొదటి పేజీ తరువాయి)**
జీవించారు. పోటీలు పడి నటించారు. అంతా బాగానే ఉంది కానీ సీరియస్‌నెస్ ఇంచుక మాత్రం లేకపోవడంతో అంతా నవ్వులమయమే అయ్యిందా మాక్ అసెంబ్లీ.
కేటీఆర్ నవ్వును ఆపుకోవడానికే, కంట్రోల్ చేసుకోవడానికే సరిపోయింది. సీఎంను ఎగతాళి చేసేందుకే ఈ మాక్ అసెంబ్లీ పెట్టినట్టున్నారు. తలసాని పదే పదే తన పాత్రను మొత్తం కించపరిచేలాగా మలుచుకుని కేటీఆర్ ముఖంలో చిరునవ్వులు కురిపించేందుకు విశేషంగా నటించి మెప్పించే ప్రయత్నం చేశారు. ప్రతిపక్ష పాత్రలు ప్రశ్నలు సంధిస్తుంటే.. అధికార పక్షం కూడా ప్రతిపక్షానికి జతకట్టి సర్కార్‌పై ఛలోక్తులు, విమర్శలు, వ్యంగ్యం దట్టించి మొత్తానికి జోకులు వేసుకునేందుకే ఎక్కువ ప్రయార్టీ ఇచ్చారు. కానీ అది వారితో సాధ్యం కాలేదు. జబర్దస్త్ కామెడీలా అనారోగ్యకర కామెడీ స్కిట్ నే తలపించిందది. మాక్ అసెంబ్లీ అంటేనే అట్లుంటది కదా? అంటారా? అంతే అంతే. జనానికి కూడా బోర్ కొట్టింది ఈ రాజకీయాలు చూసీ చూసీ.
అందుకే వారు కూడా కొద్ది సేపు రీల్స్ చూడటం ఆపేశారు. జబర్దస్త్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా తెలంగాణ భవన్ మాక్ అసెంబ్లీ నవ్వులు కురిపిస్తుంటే వారిని చూసి జనమూ నవ్వుకున్నారు. అబ్బా.. బీఆరెస్ నేతల్లో ఇంత మంచి నటులున్నారా? అని కూడా అనుకుని ఉంటారు. కేటీఆర్ ఏ డైరెక్షన్ చేసినా అంతే.. కొంచెం చేయమంటే మనోళ్లు అతి చేస్తరాయె. మంచి మార్కులు కొట్టేసే క్రమంలో తమ నేత నెత్తికే సున్నం పెట్టే రకంగా అప్పుడప్పుడు బూమరాంగ్ అవుతూ ఉంటుంది. అది వేరే విషయం అనుకోండి.
మాక్ అసెంబ్లీ మాత్రం పని ఒత్తిడి నుంచి రిలాక్స్ కావాలనుకునే వారు తప్పకుండా చూడాల్సిన కామెడీ స్కిట్. కానీ కామెడీలో పడి.. మొన్నటి దాకా అంత సీరియస్‌గా సర్కార్ మీద పోరాడిన అంశాలన్నీ తమకు తామే పలుచన చేసుకున్నట్టు కాలేదా..? అనే చర్చ కూడా నడుస్తోంది. తలపండిన నేతలు, సీనియర్లు,ఇలా పిల్ల చేష్టలతో.. అసలైన వ్యంగ్యం వీడి.. ప్రజా సమస్యలపై సర్కార్‌ను నిలదీసే క్రమాన్ని వదిలి.. కేవలం సీఎంను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి.. తమలో తామే సంతోషపడి దీన్ని అయ్యిందనిపించారు. ఇదొక్కటే ఇందులో ట్రాజెడీ..

## ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేస్తాం

### ఏపీ ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయకుడు



**(మొదటి పేజీ తరువాయి)**
'ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌గా మారబోతోంది. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలా మందికి ప్రయోజనం చేకూరుతుంది. అర్హులైన వారికి రూ.5లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. జేపీ నడ్డా నాయకత్వంలో ఆరోగ్య రంగంలో కొత్త విప్లవాలు వచ్చాయి. ఆరోగ్య రంగంలో పెనుమార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం. 2047 నాటికి ప్రపంచంలోనే మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలి' అని సీఎం అన్నారు.

**రూ.64వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం: జేపీ నడ్డా**
ఏపీలో రూ.1,271 కోట్లతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 33 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించబోతున్నామని కేంద్రమంత్రి జేపీ నడ్డా (JP Nadda) తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడారు. చంద్రబాబుతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉంద న్నారు. 'గత దశాబ్ద కాలంగా దేశంలో ఎన్నో ఆరోగ్య విధానాలు తీసుకొచ్చాం. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు గర్విస్తున్నా. ఆరోగ్య మౌ లిక సదుపాయాల కల్పనలో ఇదో ముందడుగు. ఇలాంటి కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన చంద్రబాబుకు అభినందనలు. కొవిడ్ తర్వాత ఆరోగ్య వ్యవస్థలను పటి ష్టం చేయడంపై మోదీ దృష్టి సారించారు. వచ్చే ఐదేళ్లలో రూ.64వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయబోతున్నాం. వం టగదే ఫార్మసీ, ఆహారమే ఔషధమని చంద్ర బాబు తరచూ చెబుతారు.. అది అక్షరాలా నిజం' అని జేపీ నడ్డా పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఉన్నారు.

### బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా

## హైదరాబాద్ అభివృద్ధి

**ముద్ర, హైదరాబాద్:**
నగరాన్ని బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లును తెలంగాణ శాసనసభ లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని తెలిపారు. హైదరాబాద్ విస్తరణ పెద్దఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం రూపొందించామని చెప్పారు.
'మూసీ పునరుజ్జీవం తొలిదశకు రూ. 7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చాం. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాం. జీహెచ్‌ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నాం. అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను రూపొందించాం. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటు చేస్తున్నాం. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలని ప్రభుత్వ యోచన. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నాం. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలి. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం చేరుకోవాలి. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయాలి' అని మంత్రి తెలిపారు.
తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో చిన్నపాటి సాంకేతికపరమైన 400 రకాల నేరాలను.. నేరపూరిత పరిధి నుంచి తొలగించాలని మంత్రి శ్రీధర్‌బాబు సభలో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా వ్యాపార నిర్వహణ మరింత సులభతరమవుతుందని తెలిపారు. చాలా కేసుల్లో చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టం అందరికీ ఉపయోగపడాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. ఈ చట్టాలకు సంబంధించి కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.



### 'ఢీ-10' డ్యాన్స్ షో

## విన్నర్ రాజు అరెస్ట్

**ముద్ర, హైదరాబాద్ :**
తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 'ఢీ-10' డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## తెలంగాణలో జోరు వానలు



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకా శం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

**ఆరోగ్య శాఖ హెచ్చరిక**
వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు



**ముద్ర, ఢిల్లీ:**
ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న సంఘర్షణలకు బ్రిక్స్ దేశాలు పరిష్కారం చూపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇక నుంచి నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. ప్రపంచానికి నియమాలు నిర్దేశించేవిగా ఎదగాలని ఆకాక్షించారు. దిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన ఆయన .. ఏఐ, సైబర్ స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని, అయినప్పటికీ ఇది ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదన్నారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలకు ఓ సందేశంగా నిపుణులు భావిస్తున్నారు.
'బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ప్రజలకు మనం భరోసా కల్పించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. ప్రస్తుతం ప్రపంచ పాలనా నిర్మాణం ఓ పిరమిడ్‌లా కనిపిస్తోంది. అధికారం, నిర్ణయాలు తీసుకోవడం అనేది శిఖర భాగంలో కేంద్రీకృతమై ఉండగా.. దిగువన ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితం అవుతున్నాయి. ఆ నిర్ణయాలను రూపొందించడంలో వీటి పాత్ర పెద్దగా ఉండటం లేదు. ప్రపంచ సంక్షోభాలలో ముందువరుసలో ఉన్న గ్లోబల్ సౌత్.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. ఇకపై ప్రతి సభ్య దేశం భాగస్వామిగా మారి.. గళం వినిపించాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం మానవాభివృద్ధి కోసమే ఉండాలి. వచ్చే సదస్సు నాటికి కొత్త సంస్కరణలతో సిద్ధం కావాలి. మరోవైపు ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలి. ఆలస్యం చేయకూడదు. కాలానికి అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. పలు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలి' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## ధరణి పేరుతో బీఆర్‌ఎస్ భూదందా

**ముద్ర, హైదరాబాద్ :**
గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22–ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.
రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు.
పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య యుద్ధం కొనసాగుతోంది.

### రూ.2 కోట్లతో తెరకెక్కి.. రూ.200 కోట్ల క్లబ్‌లోకి

## 'హనుమాన్ అంశ్'

**ముద్ర, డెస్క్:**
ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'హనుమాన్ అంశ్' బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం.. రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. 'మిర్జాపూర్', 'హైవాన్' చిత్రాలను వెనక్కి నెట్టి, అత్యంత తక్కువ బడ్జెట్‌తోనే ఏకంగా రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రంగా రికార్డు సృష్టించింది.
ఈ సినిమా తొలి రోజు కేవలం రూ.10 లక్షల వసూళ్లతో మొదలై.. మొదటి రెండు వారాల్లో రూ.1.48 కోట్లు మాత్రమే రాబట్టింది. కానీ, పాజిటివ్ టాక్‌తో 16వ రోజు నుంచి అమాంతం దూసుకెళ్లింది. నాలుగో వారంలో రూ. 61 కోట్లు, ఐదో వారంలో రూ.90 కోట్లు వసూలు చేసింది. ఆరో శుక్రవారం రూ.10.50 కోట్లు రాబట్టడంతో.. దేశవ్యాప్తంగా నెట్ వసూళ్లు రూ.174 కోట్లకు చేరాయి.
ఈ చిత్రం ఇంకా ఓవర్సీస్‌లో విడుదల కాలేదు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా గ్రాస్ వసూళ్లు రూ.205 కోట్లకు చేరుకోవడం విశేషం. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో శోభినవ్ సత్య ప్రధాన పాత్ర పోషించారు. ఇక, ఈ చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్ సెప్టెంబరు 18న థియేటర్స్‌లో విడుదల కానుంది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ మూవీని సమర్పిస్తుండటం విశేషం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 13.09.2026
www.mudranews.in | @mudranews



## మలబద్ధకం: నీటికి ప్రాధాన్యం ఇవ్వండి

ఫైబర్ ఎక్కువగా తీసుకునే సమయంలో తగినంత నీరు తాగడం కూడా ముఖ్యం. పండ్లలోని ఫైబర్, నీటి శాతం కలిసి మలాన్ని మృదువుగా చేయడంలో సహాయపడవచ్చు.



## 132 కోట్లతో తిరుమల కొండపైన వెంకటాద్రి నిలయం



**ముద్ర, తిరుమల** : తిరుమల కొండపైన వెంకటాద్రి నిలయం అని దాదాపు 132 కోట్లతో నిర్మించారు. ఆధార్ చూపిస్తే దుప్పటి, చాప ఇస్తారు, ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తారు. హట్ వాటర్ ఉంటుంది, వాష్ రూమ్స్ బాగుంటాయి. ఫ్రీ లాకర్ ఇస్తారు. తల నీలాలు,అన్నదానం కూడా అక్కడే ఉంటాయి... రూమ్ ఆన్లైన్ లో దొరకలేదని, వెళ్ళాక ఆఫ్లైన్ ఎక్కువగా ఉందని... ఆలోచించకుండా... హాయిగా PAC 5 లేదా వెంకటాద్రి నిలయం లో బస చేయండి... బస్ స్టాప్ కి ముందే వస్తుంది... బస్టాండ్ వెళ్లేముందు కనిపిస్తుంది... అక్కడే ఆపి దిగవచ్చు... భక్తులు గమనించగలరు.

## 19 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు



**ముద్ర, హైదరాబాద్:** పుట్టుకతోనే గుండె జబ్బులతో బాధపడుతున్న 19 మంది చిన్నారులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు చేసిన నిమ్స్ వైద్య బృందాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 6 నుంచి 12 వరకు నిమ్స్‌లో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్‌లో ఈ శస్త్రచికిత్సలు జరిగాయి. కేవలం 2 కిలోల బరువున్న రెండు నెలల పసికందుకు సైతం విజయవంతంగా ఆపరేషన్ చేయడంపై సీఎం వైద్యులను ప్రత్యేకంగా ప్రశంసించారు. వైద్యులు డాక్టర్ డి. రమణ ధన్నపునేని, డాక్టర్ ఎం. అమరేష్‌రావు సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## క్వాంటం బయో వ్యాలీకి కేంద్ర సహకారం



**ముద్ర, అమరావతి** : అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం అందిస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై చర్చించేందుకు కేంద్రం నుంచి సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. 'కిచెన్ ఈజ్ ఫార్మసీ.. ఆహారమే ఔషధం' అనే సీఎం చంద్రబాబు సూచనలను నడ్డా తన ప్రసంగంలో ప్రస్తావించారు. చంద్రబాబు విజన్, నిబద్ధతను కొనియాడిన ఆయన.. ఏపీ సేఫ్ హ్యాండ్స్‌లో ఉందన్నారు. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ–నీవా ప్రాజెక్టుల ప్రారంభాన్ని అభినందించారు. అనంతరం నడ్డాతో కలిసి సీఎం చంద్రబాబు వేదికపై సెల్ఫీ దిగారు.

## రెట్రో మ్యాజిక్ vs సైబర్ ట్రాప్:

**సోషల్ మీడియాలో '1980' ట్రెండ్ కలకలం!**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం** : ప్రస్తుతం సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తున్న సరికొత్త ముచ్చట '1980 రెట్రో ట్రెండ్' డిజిటల్ ప్రపంచంలో రోజుకో కొత్త ఫ్యాషన్లు, ట్రెండ్లు వెలుగులోకి వస్తున్నప్పటికీ, నాలుగున్నర దశాబ్దాల నాటి జ్ఞాపకాలను రీ–క్రియేట్ చేస్తూ సాగుతున్న ఈ రెట్రో ట్రెండ్ ప్రతి ఒక్కరినీ ఎంతగానో ఆకట్టుకుంటోంది. కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతను ఉపయోగించి తమ ప్రస్తుత ఫోటోలను 1980ల నాటి క్లాసిక్ లుక్‌లోకి మార్చుకోవడం ఇప్పుడు నెటిజన్లకు ఓ పెద్ద క్రేజ్‌గా మారింది. ఆనాటి బెల్ బాటమ్ ప్యాంట్లు, పొడవాటి జుట్టు శైలులు, పురాతన వాహనాలు, పాతకాలపు ఇళ్ల నేపథ్యాలతో నిండిన ఈ AI ఫోటోలు ఇన్స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ స్టేటస్‌లలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ రెట్రో ఫోటోల వెనుక రకరకాల భావోద్వేగాలు, ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. అప్పట్లో పుట్టి పెరిగిన పెద్దలు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మురిసిపోతుంటే, 1980ల తర్వాత పుట్టిన నేటి యువత మాత్రం ఆ కాలపు జీవనశైలిని, తమ పూర్వీకుల పోలికలను తమ ఫోటోలలో చూసుకుంటూ సంబరపడిపోతున్నారు. "జర పైలం" అంటూ నెటిజన్లు ఒకరిపై ఒకరు విసురుకుంటున్న సెటైర్లు, చమత్కారాలు ఈ ట్రెండ్‌కు మరిన్ని రంగులద్దుతున్నాయి. మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనాటి వాతావరణాన్ని పునఃసృష్టిస్తూ పోస్టులు చేస్తుండటంతో, నెట్టింట సరదా సందడి వాతావరణం నెలకొంది. అయితే, ఈ అందమైన 'రెట్రో వైబ్స్' వెనుక ఒక ముళ్ల బాట కూడా దాగి ఉందని సైబర్ భద్రతా నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. సరదా వెనుక పెద్ద ముప్పు ముంచుకొచ్చే ప్రమాదం ఉందనే విషయాన్ని నెటిజన్లు గుర్తుంచుకోవాలి. "ఒకే ఒక్క క్లిక్‌తో మీ 1980 లుక్ పొందండి" అంటూ సోషల్ మీడియాలో విచ్చలవిడిగా వస్తున్న అనుమానాస్పద లింకులు, ధృవీకరణ లేని థర్డ్ పార్టీ యాప్‌ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. మన వ్యక్తిగత ఫోటోలను ఇలాంటి థర్డ్ పార్టీ యాప్‌లలో అప్‌లోడ్ చేయడం వల్ల ఆ డాటా దుర్వినియోగం అయ్యే లేదా డీప్‌ఫేక్ సాంకేతికతతో ఇతరులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.మరీ ముఖ్యంగా, ఫోటో ఎడిటింగ్ , ప్రాసెసింగ్ పేరుతో కొన్ని నకిలీ యాప్‌లు ఓటీపీలు, అనుమతులు అడుగుతుంటాయి. ఆ తొందరపాటులో జాగ్రత్త వహించకపోతే బ్యాంక్ ఖాతాలు నిమిషాల్లో ఖాళీ అయిపోయే అవకాశం ఉందని అధికారులు తేల్చిచెబుతున్నారు. అందుకే "ట్రెండ్ పేరుతో అజాగ్రత్తగా ఉంటే " జేబుకి గుండు గీసేస్తారు" అంటూ సోషల్ మీడియాలోనే విశ్లేషకులు జోకులు పేలుస్తున్నారు.

ఏది ఏమైనా, సాంకేతికతను వినోదం కోసం ఉపయోగించుకోవడం తప్పుకాదు, కానీ ఆ మోజులో పడి వ్యక్తిగత భద్రతను, గోప్యతను పక్కనబెట్టకూడదు. పాత జ్ఞాపకాలను కొత్తగా అనుభవించే క్రమంలో డిజిటల్ భద్రతా సూత్రాలను పాటించడం, సైబర్ నేరాల పట్ల స్పృహ కలిగి ఉండటం అత్యవసరం. సంతోషాన్నిచ్చే రెట్రో లుక్ సైబర్ ట్రాప్‌గా మారకముందే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# మనిషిని ఆలోచింపజేసే శక్తి హిందీ సాహిత్యంలో ఉంది

**హిందీ దేశ ప్రజలను కలిపే వారధి**
**హిందీ సాహిత్యానికి గొప్ప చరిత్ర**
**మానవ విలువలను ప్రతిబింబించిన రచనలు**
**స్వేచ్ఛా పత్రికే ప్రజాస్వామ్యానికి బలం**
**ప్రజల పక్షాన హిందీ పత్రికలు నిలవాలి**
**-TUWJ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**






**ముద్ర, హైదరాబాద్:** హిందీ కేవలం ఒక భాష మాత్రమే కాదని, అది భారతదేశంలోని కోట్లాది ప్రజల భావాలను, సంస్కృతిని, ఆలోచనలను ఒకరికొకరికీ చేరువ చేసే శక్తివంతమైన వారధి అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. "హిందీ దివస్" వేడుకలో భాగంగా శనివారం బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ ఏర్పాటు చేసిన సభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతుల మధ్య అనుసంధానాన్ని పెంచడంలో హిందీ భాష కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. హిందీ భాషకు ఎంతో గొప్ప సాహిత్య సంపద ఉందని, కబీర్, తులసీదాస్, ప్రేమ్‌చంద్ వంటి మహనీయుల రచనలు భారతీయ సమాజాన్ని, మానవ విలువలను, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించాయన్నారు. హిందీ సాహిత్యం మనిషిని ఆలోచింపజేసే శక్తిని కలిగి ఉందని విరాహత్ అలీ కొనియాడారు. భాష మన భావాలకు, పత్రిక మన గొంతుకకు బలాన్నిస్తే, స్వేచ్ఛా పత్రిక ప్రజాస్వామ్యానికి బలాన్ని ఇస్తుందని ఆయన స్పష్టం చేసారు. భాష మరింత అభివృద్ధి చెందాలని, హిందీ పత్రికలు మరింత బలంగా ప్రజల పక్షాన నిలవాలని, దేశంలోని అన్ని భాషల పత్రికలు స్వేచ్ఛగా, నిర్భయంగా, బాధ్యతాయుతంగా పనిచేసే వాతావరణం ఏర్పడాలని విరాహత్ అలీ పేర్కొన్నారు.

## అలై-బలై వేడుకలకు కేంద్ర మంత్రి మేఘ్వాల్‌కు ఆహ్వానం



**ముద్ర, న్యూఢిల్లీ:** మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కేంద్ర న్యాయ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను శనివారం న్యూఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అలై–బలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వార్షిక 'అలై–బలై–2026' వేడుకలకు హాజరు కావాల్సిందిగా మేఘ్వాల్‌ను దత్తాత్రేయ ఆహ్వానించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సాహిత్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రజల్లో స్నేహ భావం, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడమే వేడుకల ఉద్దేశ్యమని వివరించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మేఘ్వాల్ వేడుకల్లో తప్పక పాల్గొంటామని హామీ ఇచ్చారు.

### అన్నను కడసారి చూసేందుకు వచ్చి.. అంత్యక్రియల్లో చెల్లెలి మృతి

**ముద్ర, భువనగిరి:** తోడబుట్టిన అన్న మృతి చెందగా.. కడసారి చూసేందుకు వచ్చిన చెల్లెలు.. చివరికి అన్నతోనే తన జీవన ప్రయాణాన్ని ముగించింది. సోదరుడి అంత్యక్రియలు పూర్తికాకముందే ఆమె గుండె ఆగిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను కలిచివేసింది. రాయగిరికి చెందిన కొత్త మల్లయ్య యాదవ్ శుక్రవారం మృతి చెందారు. అన్న మరణ వార్త తెలుసుకున్న యాదగిరిగుట్ట మండలం దాతారుపల్లికి చెందిన చుక్కల వెంకమ్మ శనివారం రాయగిరికి చేరుకున్నారు. అన్న భౌతికకాయాన్ని చూసి తీవ్రంగా రోదించారు. అన్నను కోల్పోయిన బాధను తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచారు.

# రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు

**రేవంత్ రెడ్డిపై కవిత తీవ్ర విమర్శలు**



**ముద్ర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీని తన ప్రచారానికి వేదికగా మార్చుకున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అసెంబ్లీలో సీఎం కమల్‌హాసన్ తరహాలో ఏకపాత్రాభినయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో బ్లాక్‌మెయిలర్ల సంఘం పెడితే దానికి రేవంత్ రెడ్డే అధ్యక్షుడిగా ఉంటారని వ్యాఖ్యానించారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై చర్చించకుండా సభా ఆవరణలో పరస్పరం దూషించుకోవడం బాధాకరమన్నారు. బీజేపీ సభ్యులు కూడా ఒకవైపు బీఆర్ఎస్, మరోవైపు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తూ విచిత్రమైన పాత్ర పోషించారని ఆరోపించారు. సిద్దిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న భూమిని తొలగించి వంద ఎకరాల భూ బదలాయింపు జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని కవిత ఆరోపించారు. మూసీ నుంచి ఇసుక వరకు పలు అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్‌లో 'పాంచజన్య సంకల్ప సభ' నిర్వహించి సీఎం అవినీతి చిట్టాను ప్రజల ముందు పెడతామని ప్రకటించారు.

# తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దుతాం

**– శాసనమండలిలో మంత్రి వాకిటి శ్రీహరి**



**ముద్ర, హైదరాబాద్:** క్రీడలను విద్యతో అనుసంధానం చేసి తెలంగాణను దేశంలోనే క్రీడా శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU) ఏర్పాటు ద్వారా క్రీడాకారులకు శాస్త్రీయ శిక్షణతో పాటు స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పరిశోధన రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శాసనమండలిలో సభ్యులు బల్మూర్ వెంకట నర్సింగరావు, మహేష్ కుమార్, శ్రీపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. YIPESUను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రముఖ క్రీడా విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేస్తున్నామని, కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో సహకారానికి చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు, పాఠశాల స్థాయి నుంచే ప్రతిభా అన్వేషణ, మండల–జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. సీఎం కప్‌లో 2025లో రూ.38.50 కోట్ల వ్యయంతో 46 క్రీడాంశాల్లో 5.42 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయని వెల్లడించారు. క్రీడాకారుల ప్రోత్సాహానికి 145 మందికి రూ.16.60 కోట్లు అందించామని, స్పోర్ట్స్ కోటా ద్వారా 304 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు డీఎస్పీ స్థాయి ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

క్రీడా బడ్జెట్‌ను భారీగా పెంచామని, మూడు బడ్జెట్లలో రూ.1,535 కోట్లు కేటాయించామని తెలిపారు. క్రీడా అకాడమీల సంఖ్యను 6 నుంచి 19కి పెంచామని, మహిళలతో పాటు రెండు ఎలైట్ ఫిఫా ఫుట్‌బాల్ అకాడమీలను ఏర్పాటు చేశామని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియాన్ని రూ.700 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని, కొత్త హాకీ టర్ఫ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

డిసెంబర్ 11 నుంచి 22 వరకు 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను రూ.272 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణలో నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. హాకీ ఇండియా లీగ్, వరల్డ్ పికిల్‌బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్‌లను కూడా రాష్ట్రంలో నిర్వహించనున్నామని చెప్పారు. క్రీడలు–విద్య–ఉపాధి–పరిశోధనలను అనుసంధానం చేసి తెలంగాణ యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

**- దాసోజు శ్రవణ్**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమానికి పాట, ఆట, కళలతో ఊపిరి పోసిన పేదింటి కళాకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. శాసనమండలిలో కళాకారుల సంక్షేమంపై ఆయన పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యమ కళాకారులకు తక్షణమే EHS హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు శాశ్వత సర్వీస్ రూల్స్, పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. గతంలో 582 మంది కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినా, వారికి ఇప్పటికీ పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత లేకపోవడం అన్యాయమన్నారు. అలాగే మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు, బిల్లులు, ట్రావెల్ ఖర్చులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా యుద్ధనౌక గద్దర్ స్మృతి చిహ్నం కోసం నెక్లెస్ రోడ్డులో ఒక ఎకరం స్థలం కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని శ్రవణ్ కోరారు. మరో 500 మంది అర్హులైన ఉద్యమ, పేద కళాకారులకు సాంస్కృతిక వారధి సంస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఒగ్గు, డప్పు కళాకారులకు మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రూ.3 వేల నెలవారీ జీవనభృతిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.చిత్రపురి కాలనీ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని, తెలంగాణ కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకు సినీ స్టూడియోల నిర్మాణానికి భూములు, ఆర్థిక సహకారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కళాకారుల సంక్షేమాన్ని రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని దాసోజు శ్రవణ్ విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 13.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




# తెలంగాణ మాల్దీవులు..

**తక్కువ ఖర్చుతో ఊహించని మధురానుభూతి**

మాల్దీవులు.. ప్రపంచంలో అందమైన పర్యాటక ప్రదేశాల్లో ఒకటి. తక్కువ ఖర్చుతో వెళ్లొచ్చే దేశం కావడంతో భారత్ నుంచి చాలా మంది మాల్దీవులకు వెళ్లొస్తారు. గతేడాది భారత వ్యతిరేక ప్రభుత్వం ఏర్పడడంతో పర్యాటకుల సంఖ్య తగ్గింది.



మాల్దీవులు.. ఈ పేరు వింటేనే అందరికీ స్వర్గంలో తెలిపోతున్నట్లు అనిపిస్తుంది. పర్యాటక ప్రియులు ఎక్కువగా ఇష్టపడే సుందరమైన ప్రదేశాల్లో మాల్దీవులు కూడా ఒకటి. మాల్దీవుల ప్రధాన ఆదాయ వనరు కూడా పర్యాటకమే. అందుకే ఆ దేశం యాత్రికుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. భద్రతకు చర్యలు తీసుకుంటుంది. 2023లో మాల్దీవుల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. మహ్మద్ మెయిజ్జు అధ్యక్షుడు అయ్యారు. భారత వ్యతిరేయి అయిన మెయిజ్జు చైనాతో సన్నిహితంగా ఉంటూ భారత వ్యతరేక చర్యలకు మద్దతు తెలిపాడు. దీంతో ప్రధాని మోదీ గట్టి సాక్ ఇచ్చాడు. మాల్దీవులకు వెళ్లే పర్యాటకులు ఇకపై లక్ష్యద్వీప్‌కు వెళ్లాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఆయన స్వయంగా లక్ష్యద్వీప్‌లో పర్యటించి ఫొటోలు, వీడియోలు షేర్ చేశారు. దీంతో మాల్దీవులు మంత్రులు మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు భారతీయులను మరింత ఇబ్బందిగా మారాయి. దీంతో మాల్దీవులు వెళ్లాలనుకునేవారంతా లక్ష్యద్వీప్‌బాట పట్టారు. దీంతో భారత్ నుంచి మాల్దీవులకు వచ్చే ఆదాయం భారీగా పడిపోయింది. నష్టాన్ని గుర్తించిన ఆదేశం ఇప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇక ఇదిలా ఉంటే.. మాల్దీవులను తలపించే ప్రదేశం ఒకటి మన తెలంగాణలోనే ఉంది. తక్కువ బడ్జెట్‌లో వీకెండ్‌లో వెళ్లి.. మధురానుభూతి పొందిరావొచ్చు. దీనిని తెలంగాణ మినీ మాల్దీవులుగా పిలుస్తున్నారు. ఎక్కడ ఎంది... ప్రత్యేకతలు ఏమిటి.. ఎంత ఖర్చవుతుందనే వివరాలు తెలుసుకుందాం.

### నాగర్‌కర్నూల్ జిల్లాలో..

ఉమ్మడి పాలమూరు.. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశం సోమశిల. దీనిని తెలంగాణ మినీ మాల్దీవులుగా పిలుస్తారు. జాతీయ గ్రామీణ పర్యాటక ప్రాంతంగా సోమశిలకు ఇటీవలే అవార్డు దక్కింది. హైదరాబాద్ నుంచి కేవలం 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమశిల పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధి చెందిదని. నదీ జలాలు, పచ్చని అడవుల మధ్య వీకెండ్ ట్రిప్‌కు ఎంతో అనువుగా ఉంటుంది.

### కమ్మనైన చేపలు..

కృష్ణానది తీర ప్రాంతంలోని ఈ ప్రాంతం ఒక ద్వీపంగా మారింది. సోమశిల గ్రామంలో కృష్ణా బ్యాక్ వాటర్ ఉండడంతో ద్వీపం వంటి అనుభూతి కలుగుతుంది. అందుకే దీనిని మినీ మాల్దీవులుగా పిలుస్తారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఇక్కడికి వచ్చే ప్యాటకులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. బోటింగ్ సదుపాయం కూడా ఉంది. కృష్ణానది తీరంలో బోటింగ్‌తోపాటు ప్రత్యేకంగా వంటకాలు రుచి చూడవచ్చు. కమ్మనైన చేపల కూడా అందరినీ నోరూరిస్తుంది. ఇక్కడి నుంచి శ్రీశైలానికి బోట్‌లో వెళ్లొచ్చు. ఇక సోమశిలలో దాదాపు 15 ఆలయాలు ఉన్నాయి.

### ఇలా వెళ్లాలి..

సోమశిల హైదరాబాద్ నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉంది. నేషనల్ హైవే 65 మీదుగా 3 నుంచి 4 గంటల ప్రయాణంతో అక్కడకు చేరుకోవచ్చు. నాగర్ కర్నూల్‌జిల్లా కోల్లాపూర్ మండలంలో ఈ గ్రామం ఉంది.

ఇటీవలే సోమశిలకు ఉత్తమ పార్యాటక గ్రామ అవార్డు లభించింది. ఈ లిస్టులో నిర్మల్ కూడా ఉంది. దేశవ్యాప్తంగా 8 కేటగిరీలలో 36 గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది. తెలంగాణనుంచి కళాకృతుల విభాగంలో నిర్మల్, ఆధ్యాత్మిక, ఆరోగ్య విభాగంలో సోమశిలకు అవార్డులుచ్చాయి.



**గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గిజా.. (ఈజిప్ట్)**

ఈజిప్ట్ లోని చెరోప్స్ యొక్క గ్రేట్ పిరమిడ్ ప్రపంచంలోని అత్యంత అద్భుత కట్టడంలో ఒకటి. 2584–2561 బీసీ లో పాలించిన ఫరాహ్ ఖుఫ్లు. ఈ గిజా పీఠభూమిపై తన సమాధి నిర్మాణంకోసం ఒక భారీ ప్రణాళికనుఅమలుచేశారు. దీనిని నిర్మించడానికి 13 హెక్టార్ల భూమిని కేటాయించుకున్నాడు. పూర్తిగా మానవ సహిత నిర్మాణమైన ఈ పిరమిడ్లో గ్యాలరీలు, లోపలి మందిరాలు, గదులు ఉన్నాయి. 3800 సంవత్సరాల కిందటే నిర్మించినట్లుతెలుస్తోంది.



**అజంతా గుహలు(ఇండియా)**

భారతదేశంలోని మహారాష్టంలోని ఔరంగాబాద్ జిల్లాలో అజంతా గుహలుకనిపిస్తాయి. సుమారు రెండో శతాబ్దంలో ఒకపెద్ద గుట్టను తొలిచి నిర్మించారు. విశ్వవ్యాప్తంగా బౌద్ధమత కళ యొక్క కళాఖండాలుగా రాక్, కట్ శిల్పాలు ఇందులోకనిపిస్తాయి. ఇవి పురాతన భారతీయ కళనుచూపిస్తాయి.



**చాకో కెన్యాన్(మెక్సికో)**

చాకో కల్చర్ నేషనల్ హిస్టారికల్ పార్క్ అమెరికాలోని నైరుతి ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఉటా, కొలరాడో, అరిజోనా, న్యూమెక్సికో రాష్ట్రాలున్నాయి. ఏడీ 900–1150 మధ్య చాకో కెన్యాన్ పూర్వీకుల ప్యూబ్లోన్స్ సంస్కృతికి ప్రధాన కేంద్రంగా ఉంది. చాకో వద్ద ఆర్కియో ఖగోళ శాస్త్రానికి సంబంధించిన సాక్ష్యం ప్రతిపాదించబడింది. విశాలమైన కొలరాడో పీభూమిపైన పశ్చిమాన చుస్కా పర్వతాలు, ఉత్తరాన శాన్ జువాన్పర్వతాలు, తూర్పున శాన్ పెడ్రో పర్వతాలుఉన్నాయి.

**మున్నార్**

మున్నార్.. కేరళ రాష్ట్రంలోని ఒక అందమైన హిల్ స్టేషన్. ఇక్కడ పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. టీ తోటలు, పచ్చని లోయలు, జలపాతాలు, సరస్సులు, అరుదైన నీలి కురింజి పువ్వులు ఇక్క డి ప్రత్యేకతలు. ఎరవికులం నేషనల్ పార్క్, మట్టుపెట్టి ఆనకట్ట, కుండల సరస్సు, టీ మ్యూజియం వంటివి చూడదగిన ప్రదేశాలు.






# మునక్కాయ సూప్..

**కావలసినవి:**

మునక్కాయలు: 3 (ముక్కలుగా కట్ చేసినవి), మసూర్ దాల్: 3 టేబుల్ స్పూన్లు, టొమాటో: ఒకటి (ముక్కలుగా కట్ చేసినది), ఉల్లిపాయ: 1/2 (ముక్కలుగా కట్ చేసినది), వెల్లుల్లి రెబ్బలు: 2, పచ్చిమిర్చి: 2, దాల్చిన చెక్క: ఒక అంగుళం, లవంగాలు: 1/2 టీస్పూన్, మిరియాలు: టీస్పూన్, ధనియాలు: టీస్పూన్, జీలకర్ర: టీస్పూన్, ఉప్పు: రుచికి సరిపడా, నీళ్లు: అవసరమైనన్ని, నల్ల ఉప్పు: 1/2 టీస్పూన్, కొత్తిమీర: 2 టేబుల్ స్పూన్లు, పుదీనా: 2 టేబుల్ స్పూన్లు



**తయారీ:**

ముందుగా ఒక ప్రెజర్ కుక్కర్ తీసుకొని, అందులో కట్ చేసిన మునక్కాయ ముక్కలు, మసూర్ దాల్, టొమాటో ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి వేయండి. అందులోనే దాల్చిన చెక్క, లవంగాలు, మిరి యాలు, ధనియాలు, జీలకర్ర, సాధారణ ఉప్పు కూడా కుక్కర్‌లోనే వేసేయండి.

చివరగా 3 కప్పుల నీళ్లు పోసి, మూత పెట్టి ఐదు విజిల్స్ వచ్చే వరకు సిమ్‌లో ఉడికించండి. తరువాత ఉడికిన మిశ్రమం నుంచి వడకట్టి నీటిని వేరు చేసి పక్కన పెట్టుకోండి.

ఉడికిన మునక్కాయ ముక్కలను, మిగిలిన పదార్థాలను ఒక మిక్సీ జార్‌లోకి తీసుకొని కొద్దిగా నీళ్లు జోడించి, మెత్తగా గ్రైండ్ చేయండి.

ఇప్పుడు ఈ గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని ఒక జల్లెడ సహాయంతో బాగా వడకట్టి, మునక్కాయ తొక్కలు రాకుండా కేవలం చిక్కటి గుజ్జును మాత్రమే వేరు చేసుకోండి.

ఇప్పుడు ఒక కడాయి స్టవ్ పై పెట్టి, అందులో మనం వడకట్టుకున్న మునక్కాయ గుజ్జు, మొదట పక్కన పెట్టుకున్న ఉడికించిన నీళ్లను పోయండి.

ఇందులో నల్ల ఉప్పు వేసి బాగా కలిపి, సూప్‌ను మరిగించండి.

సూప్ మరుగుతున్న సమయంలో, ఒక చిన్న మిక్సీ జార్‌లో 2 టేబుల్ స్పూన్ల కొత్తిమీర, 2 టేబుల్ స్పూన్ల పుదీనా వేసి కొద్దిగా నీటితో మెత్తటి పేస్ట్‌లా గ్రైండ్ చేయండి.

ఈ కొత్తిమీర–పుదీనా పేస్ట్‌ను మరుగుతున్న సూప్‌లో వేసి బాగా కలపండి. అంతే ఎంతో రుచికరమైన, వేడివేడి మునక్కాయ సూప్ సిద్ధం!

# బటర్ చిక్‌పీస్..

**కావలసినవి:**

కాబూలీ చనా: కప్పు (ఉడికించినవి), బటర్: 2 పెద్ద చెంచాలు, నూనె: టీస్పూన్, గ్రేవీ కోసం– ఉల్లిపాయలు: 2 (ముక్కలుగా కోసినవి), టొమాటోలు: 3 (ముక్కలుగా కోసినవి), అల్లం వెల్లుల్లి పేస్ట్: టీస్పూన్, జీడిపప్పులు: 10, బిర్యానీ ఆకు: 1, కారం: రుచికి సరిపడా, గరం మసాలా: 1/2 స్పూన్, ధనియాల పొడి: టీస్పూన్, కసూరీ మేథీ: టీస్పూన్, ఫ్రెష్ క్రీమ్: 2 పెద్ద చెంచాలు, ఉప్పు: రుచికి సరిపడా, కొత్తిమీర: కొద్దిగా.

**తయారీ:**

ముందుగా స్టవ్‌పై ఒక పాన్ పెట్టి, అందులో ఒక చెంచా నూనె, ఒక చెంచా వెన్న వేసి అందులో కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి 2–3 నిమిషాలు వేయించండి.

ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, టొమాటో ముక్కలు, కొద్దిగా ఉప్పు వేసి, టొమాటోలు మెత్తబడే వరకు మూత పెట్టి మగ్గనివ్వండి.

ఈ మిశ్రమం చల్లారిన తర్వాత, మిక్సీలో వేసి మెత్తటి పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోండి.

ఇప్పుడు అదే పాన్ లో మిగిలిన ఒక చెంచా వెన్న వేసి కరిగించి.. ఇందులో బిర్యానీ ఆకు వేసి, ఆ వెంటనే మనం మిక్సీ పట్టుకున్న టొమాటో–ఉల్లిపాయ పేస్ట్‌ను వేసి బాగా కలపండి.

ఈ గ్రేవీని నూనె/వెన్న పైకి తేలే వరకు మీడియం మంటపై ఉడికించండి. ఇప్పుడు ఇందులో కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలపండి.

మసాలాలు వేగిన తర్వాత, ముందుగా ఉడికించి పెట్టుకున్న తెల్ల శనగలను నీటితో సహా వేసి, సిమ్‌లో 5 నుంచి 7 నిమిషాలు ఉడికించండి.

కర్రీ చిక్కబడిన తర్వాత, ఇందులో ఫ్రెష్ క్రీమ్ వేయండి. చివరగా కసూరి మేథీని చేతులతో నలిపి చల్లి, కొద్దిగా కొత్తిమీర కూడా వేసి నిమిషం పాటు ఉంచి స్టవ్ ఆఫ్ చేయండి. అంతే ఎంతో క్రీమీగా, నోరూరించే ఇండియన్ బటర్ చికిపీస్ రెడీ!





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 13.09.2026
www.mudranews.in | @mudranews



### ఫైబర్‌ను క్రమంగా పెంచండి



కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని రోజువారీ ఆహారంలో చేర్చడం మలబద్ధకం నియంత్రణకు ఉపయోగ పడొచ్చు. ఒక్కసారిగా ఎక్కువ ఫైబర్ తీసుకోకుండా క్రమంగా పెంచడం మంచిది.

# పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య చాలా కీలకం

**డీజీపీ సీవీ ఆనంద్**



**ముద్ర, హైదరాబాద్:** పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం పోలీసు సంక్షేమంలో కీలక భాగమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. పిల్లల విద్యపై ఆందోళన లేకుండా చేస్తే పోలీసు సిబ్బంది మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలరని తెలిపారు.మణిచి రేవులలోని అక్టోపస్, గ్రేహౌండ్స్ క్యాంపస్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అకడమిక్ బ్లాక్–I నిర్మాణానికి డీజీపీ సీవీ ఆనంద్ శంకుస్థాపన చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2024 డిసెంబర్‌లో పోలీసు సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు డీజీపీ తెలిపారు. ఆర్మీ, సైనిక్ స్కూళ్ల తరహాలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో వైఐపీఎస్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.గత ఏడాది ఏప్రిల్‌లో తాత్కాలిక ప్రాంగణంలో 120 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాలలో ప్రస్తుతం సుమారు 360 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. కొత్త భవనం పూర్తయితే వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య 700–720కు చేరే అవకాశం ఉందన్నారు.చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణవిద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడలు, సహపాఠ్య కార్య క్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని డీజీపీ చెప్పారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర అనారోగ్యకర ప్రభా వాలకు దూరంగా ఉండేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రికెట్, రాక్ క్లైంబింగ్, గుర్రపు స్వారీ వంటి క్రీడలు, సాహస కార్యక్రమాల్లో శిక్షణ అందిస్తామని చెప్పారు. విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దాలని డీజీపీ పేర్కొన్నారు.పోలీసు సిబ్బందితో పాటు హోంగార్డుల పిల్లలకు కూడా పాఠశాలలో చదివే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇతర వర్గాల పిల్లలకు కూడా అందుబాటు ఫీజుతో నాణ్యమైన విద్య అందించనున్నట్లు చెప్పారు. 50 శాతం సీట్లు సాధారణ విద్యార్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు.ఒకే క్యాంపస్‌లో ప్లస్–టూ వరకు విద్యపాఠశాల అభివృద్ధి కోసం అకడమిక్ కమిటీలతో సహా పలు సబ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. ప్రభుత్వ సహకారంతో వైఐపీఎస్‌ను ప్లస్–టూ వరకు ఒకే క్యాంపస్‌లో విద్య అందించే పూర్తి స్థాయి పాఠశాలగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో వైఐపీఎస్‌ను ఉన్నత ప్రమాణాల విద్యాసంస్థగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, నిర్మాణం మరియు ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీజీపీ ఆదేశించారు.పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం సమర్థవంతమైన పోలీసింగ్‌తో నేరుగా ముడిపడి ఉన్నాయని సీవీ ఆనంద్ అన్నారు. తమ పిల్లల విద్య గురించి ఆందోళన లేకుండా ఉంటే పోలీసు సిబ్బంది విధులపై మరింత దృష్టి సారించగలరని పేర్కొన్నారు.కార్య క్రమంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, డీజీ అక్టోపస్ అనిల్ కుమార్, సైబరాబాద్ సీపీ రమేష్, ఐజీ పీఅండ్ ఎల్ గజారావు భూపాల్, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అండ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ కుమార్, డీసీపీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ ఉదయ్ రెడ్డి, ఏసీపీలు, వివిధ సంస్థల ప్రతినిధులు, వైఐపీఎస్ ప్రిన్సిపల్ డా. అనితా రెడ్డి, జీఎం రాజేష్, పోలీసు అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అధిక బొగ్గు ఉత్పత్తికి సవరించిన లక్ష్యాల మేరకు ఓబీ తొలగించాలి




**ముద్ర, సింగరేణి భవన్:** రాష్ట్ర విద్యుత్ అవస రాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో సవరించిన ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపు లక్ష్యాలను రోజువారీగా సాధించాలని సంస్థ సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి సూచించారు.శనివారం సింగరేణి వ్యాప్తంగా 15 ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు పనులు చేపడుతున్న 19 ఆఫ్‌లోడింగ్ సంస్థల పనితీరుపై ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును సరఫరా చేయాలంటే ఓబీ తొలగింపు లక్ష్యాలను కచ్చితంగా సాధించాల్సిన అవసరం ఉందన్నారు.ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు లక్ష్యానికి గాను 101 శాతంతో 1,221 లక్షల క్యూబిక్ మీటర్లు తొలగిం చినట్లు తెలిపారు. అయితే 19 ఆఫ్‌లోడింగ్ సంస్థల్లో 8 సంస్థలు మాత్రమే 100 శాతం లక్ష్యాలను సాధించాయని, మిగిలిన సంస్థలు పనితీరును మెరుగుపరుచుకో వాలని సూచించారు.సెప్టెంబర్‌లో రోజువారీ ఓబీ తొలగింపు లక్ష్యాన్ని 7.28 లక్షల క్యూబిక్ మీటర్ల నుంచి 12.1 లక్షల క్యూబిక్ మీటర్లకు పెంచినట్లు వెల్లడించారు. జేవీఆర్ ఓసీ, మణుగూరు ఓసీ, జీడీకే ఓసీ, ఆర్జీ ఓసీ–2, ఆర్జీ ఓసీ–3, కేటీకే ఓసీ–2, శ్రీరాంపూర్ ఓసీలలో వెనుక బడిన సంస్థలు గత లోటును పూడ్చడంతో పాటు తాజా లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.ప్రతి ఆఫ్‌లోడింగ్ సంస్థ విని యోగిస్తున్న షవల్స్, డంపర్ల సంఖ్యతో పాటు లక్ష్యాల సాధనకు అవసరమైన యంత్రాల వివరాలపై సమీక్షించారు. కొత్త ఓపెన్‌కాస్ట్ గనులకు సంబం ధించిన ఓబీ తొలగింపు ఆఫ్‌లోడింగ్ టెండర్ ప్రక్రియను వేగవం తంగా పూర్తిచేయాలని అధికా రులను ఆదేశించారు. సమీక్షలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమలరావు, ఈడీ బి. వెంకన్న, జీఎం టి. శ్రీనివాస్‌తో పాటు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ రూపొందించాలి

**ఎమ్మెల్సీ మల్క కొమురయ్య**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో క్రీడారంగంపై జరిగిన చర్చలో ఆయన పలు సూచనలు చేశారు.హర్యానా రాష్ట్రం అనుసరిస్తున్న క్రీడా విధానాలను అధ్యయనం చేసి తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మెరుగైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల తో పాటు అథ్లెటిక్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఖేలో ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా లభించే కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగిం చుకోవాలని కోరారు. మైసూర్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలని, ఇందుకు ప్రభుత్వం అవసరమైన స్థలాన్ని కేటాయిం చాలని అన్నారు. క్రీడా హాస్టళ్లలోని క్రీడాకా రులకు వారి శారీరక అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన డైట్ అందించా లని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్లేగ్రౌండ్, పీఈటీ ఉపాధ్యాయు లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లాల్లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దేశంలో క్రీడలకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణను కూడా క్రీడా శక్తిగా తీర్చిదిద్దేందుకు తగిన బడ్జెట్, మౌలిక వసతులు, శిక్షణ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

**వి. శ్రీనివాస్ గౌడ్**




**ముద్ర, హైదరాబాద్:** విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల ని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహిం చిన తెలంగాణ రాజకీయ ముఖ చిత్రం రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులతో పాటు ఖాళీ కాబోయే ఎమ్మెల్సీ స్థానాలు, కార్పొరేషన్ చైర్మన్, ఇతర నామినేటెడ్ పదవుల్లో బీసీలు, అత్యంత వెను కబడిన వర్గాలకు (ఎంబీసీ) తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. బీసీ కులగణన అంశంపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరింత గట్టిగా పోరాడాలని, దేశవ్యాప్తంగా కులగణన జరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురా వాలని కోరారు. రానున్న డీలిమిటేషన్‌తో పాటు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో బీసీలకు హామీలు ఇచ్చి అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తమ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలు, దాడులను ప్రతిఘటిస్తూ కులగణన, రిజర్వేషన్లు, హక్కుల సాధన కోసం రాష్ట్ర, దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీసీ ఇంట లెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలగోని బాల్‌రాజు గౌడ్‌తో పాటు 55 బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**ముద్ర, కూకట్‌పల్లి :** కె పి హెచ్ బి 6వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ పార్కులో ఆర్ జి వి వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిర క్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని పిలుపు నిచ్చారు. వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటూనే, ప్రకృతికి హాని కలగకుండా సహజసిద్ధమైన మట్టి ప్రతిమలను ఉపయోగించడం ఎంతో అభి నందనీయమని కొనియాడారు.సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని తలపెట్టిన ఆర్ జి వి వి ఫౌండేషన్ చైర్మన్ ఎన్. రత్న గురు ప్రసాద్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్య త్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

**ముద్ర, మేడ్చల్:** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (TGPCB) ప్రాంతీయ కార్యాలయం–మేడ్చల్ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ భవనం, బాలానగర్‌లోని బీబీఆర్ ఆసుపత్రి సమీపం, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్, సుభాష్‌నగర్‌లోని బోధిసత్వ స్కూల్, కొంపల్లి, ఆనంద్‌బాగ్, రాంపల్లి, నాగారం ప్రాంతాల్లో ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP), కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. సహజ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవడంతో పాటు పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయని తెలిపారు.ప్రజలు పర్యావరణహిత పద్ధతుల్లో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని అధికారులు సూచించారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బి. రాజేందర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది నిర్వహించారు.

## ఏఐపీసీ చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ఖర్గేకు కృతజ్ఞతలు



**ముద్ర, బెంగళూరు:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను బెంగ ళూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఖర్గేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.తనపై నమ్మకంతో కీలక బాధ్యత అప్పగించినందుకు మధుయాష్కి గౌడ్ ఖర్గేకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేస్తూ.. వారందరినీ జాతీయ స్థాయిలో ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ఖర్గే సూచించారు.

## గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



**ముద్ర, చేవెళ్ల :** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని షాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి రెడ్డి నిర్వా హకులకు సూచించారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని స్టార్ గార్డెన్‌లో గణేశ ఉత్సవ కమిటీలు, విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణేశ్ మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, విగ్రహం ఎత్తు, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను పోలీస్ ప్రొటోకాల్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతులు పొందాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద అగ్ని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.గణేశ్ నిమజ్జనం, ఊరేగింపులను మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించాలని కోరారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు, నిర్వాహకులు, భక్తులు సమన్వయంతో వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు.అవాంఛనీయ ఘటనలు చోటుచే సుకున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో ఎస్సైలు చెన్నారెడ్డి, విజయ్, ఫైర్ అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ ఐ ఖాజా విద్యుత్ ఏఈ కోటేశ్వరరావు,పోలీసు సిబ్బంది, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ



**పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, శేరిలింగంపల్లి :** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గోదాకృష్ణ ఫంక్షన్ హాల్ లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ కళ్యాణ్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల ఆకలి తీర్చే ఆపద్బాంధవుడని, పేదల పక్షపాతిగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారని కొనియాడారు.ఒకప్పుడు ధనికులకే పరిమితమైన సన్న బియ్యాన్ని పేదల కంచంలోకి తెచ్చిన గొప్ప దార్శనికుడు సీఎం రేవంత్ రెడ్డి అని, వారికి మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. రైతులకు సన్న రకం వరి సాగుపై ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రభుత్వం దూరదృష్టితో నిర్ణయం తీసుకుందన్నారు.శేరిలిం గంపల్లి నియోజకవర్గంలో మొత్తం 94,482 రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందే వరకు ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగు తుందని స్పష్టం చేశారు. అర్హులు మీ–సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రజా పంపిణీ వ్యవస్థను సాంకేతికంగా బలోపేతం చేసేందుకు క్యూఆర్ కోడ్, కుటుంబ వివరాలతో పటిష్టమైన స్మార్ట్ కార్డులను రూపొందించామని, వీటి ద్వారా రేషన్ పంపిణీలో పారదర్శకత పెరుగుతుందన్నారు. జనాభాకు అనుగుణంగా రేషన్ షాపుల సంఖ్యను కూడా పెంచుతామని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో త్వరలోనే ఎల్లమ్మబండలో మహిళా పెట్రోల్ బంక్, మహిళా భవనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే తన ప్రధాన ధ్యేయమని గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, రేషన్ డీలర్లు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కివీకి శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి

కివీపై జరిగిన అనేక అధ్యయనాలను సమీక్షించిన పరిశోధనల్లో వారానికి మల విసర్జనల సంఖ్య పెరగవచ్చని తేలింది. అయితే అందుబాటులో ఉన్న ఆధారాల నాణ్యత పూర్తిగా బలమైనది కాదని పరిశోధకులు పేర్కొన్నారు. కాబట్టి కివీని మల బద్ధకానికి సహాయక ఆహారంగా చూడాలి, మందుకు ప్రత్యామ్నాయంగా కాదు.



## తెలంగాణ శాసనసభ ఈ నెల 16కి వాయిదా




**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణ శాసనసభ ఈ నెల 16కి వాయిదా పడింది. ఈ నెల 14న వినాయక చవితి పండగ నేపథ్యంలో సభకు మూడు రోజుల పాటు విరామం ఇచ్చారు. తిరిగి 16న (బుధవారం) శాసనసభ ప్రారంభం కానుంది. మరోవైపు శాసనమండలి నిరవధిక వాయిదా పడింది.

## ఖైరతాబాద్ గణేష్‌కు భారీ రద్దీ.. ట్రాఫిక్ పోలీసుల బిగ్ ప్లాన్

**30 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా**
**500 మంది ట్రాఫిక్ సిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ**
**మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ వినియోగించాలని సూచన**
**ఐమాక్స్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు భారీ పార్కింగ్**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా దాదాపు 30 లక్షల మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని అంచనా వేస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ వెల్లడించారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ స్తంభించకుండా, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా 500 మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా విధుల్లో నియమించినట్లు ఆయన తెలిపారు.

**నాలుగు ప్రత్యేక మార్గాలు , రవాణా సూచనలు**

భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకోవడానికి వీలుగా నాలుగు వేర్వేరు మార్గాలను అందుబాటులోకి తెచ్చారు. వీఐపీల కోసం ప్రత్యేక రూట్‌ను కేటాయించగా, మెట్రో స్టేషన్ నుంచి దిగి వచ్చే భక్తులు నేరుగా దర్శనానికి వెళ్లేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కాకుండా ఉండాలంటే భక్తులందరూ ప్రజా రవాణా వ్యవస్థలైన మెట్రో, ఎంఎంటీఎస్ (MMTS), ఆర్టీసీ (RTC) స్పెషల్ బస్సులను ఎక్కువగా వినియోగించుకోవాలని జాయింట్ సీపీ కోరారు. ఒకవేళ సొంత వాహనాల్లో రావాల్సి వస్తే, కుటుంబ సభ్యులు లేదా మిత్రులు కార్ పూలింగ్ పద్ధతిని పాటించి ఒకే వాహనంలో రావడం ద్వారా రోడ్లపై వాహనాల రద్దీని గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.

**రద్దీ నియంత్రణ , పార్కింగ్ వివరాలు**

కేవలం వీకెండ్స్ లేదా సాయంత్రం వేళల్లోనే కాకుండా, సాధారణ రోజుల్లో (వీక్ డేస్) కూడా భక్తులు తమ దర్శన సమయాన్ని ప్లాన్ చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. మెట్రోలో వచ్చే భక్తులు స్టేషన్ బయట ఉన్న ట్రాఫిక్ పోలీసుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఇక వాహనాలతో వచ్చే వారి సౌకర్యార్థం ఐమాక్స్ గ్రౌండ్, హెచ్ఎండీఏ స్థలాలు, ఎన్టీఆర్ పార్క్ వెనుక భాగం, నెక్లెస్ రోడ్ పరిసర ప్రాంతాలలో భారీ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు మాత్రమే బడా గణేష్ దర్శనం అందుబాటులో ఉంటుందని, రాబోయే పది రోజుల పాటు భక్తులందరూ ట్రాఫిక్ పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ విజ్ఞప్తి చేశారు.

## ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు

**- హరీశ్‌రావు**



**ముద్ర, హైదరాబాద్**: తాము అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి పొంగులేటి సమాధానం చెప్పలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో స్పష్టత వస్తుందని అందరూ భావించారని, కానీ నిరాశే మిగిలిందని వ్యాఖ్యానించారు. తమను సస్పెండ్ చేసి.. పొంగులేటి అబద్ధాల ప్రవాహం పారించారని విమర్శించారు. తాము సభలో ఉంటే.. అవినీతి, కుంభకోణాలు బయటపెడతామన్న కారణంతోనే సస్పెండ్ చేశారన్నారు. భాజపా, బీఆర్ఎస్ ఒకటే అని చెప్పే చిల్లర ప్రయత్నం చేశారని తెలిపారు. "22ఏలో ఎన్ని ఎకరాలు పెట్టారో చెప్పాలని కోరితే పొంగులేటి నుంచి సమాధానం లేదు. 22ఏ అంశంపై ప్రశ్నించినందుకే నాపై వ్యక్తిగత దాడి చేశారు. తప్పుడు జాబితా అప్‌లోడ్ చేశామని చెప్పారు. తప్పు ఒప్పుకొని పొంగులేటి క్షమాపణలు చెబుతారని ఆశించాం. క్షమాపణ చెప్పకుండా మాపై ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని 22ఏ నుంచి రాత్రికి రాత్రి తొలగించారు. పేదల ఆస్తులపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మంత్రి పొంగులేటి అబద్ధాలు, అర్ధ సత్యాలు చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పొంగులేటి బుకాయించే ప్రయత్నం చేశారు. ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు. గతంలోనే నిషేధిత జాబితాలో ఉంటే మా హయాంలో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? గతంలో ఉన్న సమస్య అయితే పొరపాటు జరిగిందని సారీ ఎందుకు చెప్పారు? నాదర్‌గుల్, వట్టినాగులపల్లి, ఖాజాగూడ, అబ్దుల్లాపూర్‌మెట్ భూముల అంశంపై పొంగులేటి ఎందుకు మాట్లాడలేదు? తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నాపై ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మా మామ ఎక్స్‌సర్వీస్‌మెన్ నుంచి భూమి కొన్నారు. మా మామ కొన్న భూమి ఎకరా రూ.15 కోట్లు అన్నారు. ఎకరా రూ.15 కోట్లు కదా.. మాకు రూ.50 లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోండి. తప్పులు జరిగి ఉంటే.. మూడేళ్లుగా ఎందుకు చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ అవినీతి బయటపెట్టినందుకే.. నాపై బురద జల్లుతున్నారు. భూభారతిలో రెండు తప్పులు జరిగినట్లు పొంగులేటి ఒప్పుకొన్నారు. భూభారతి అంత సీల్ ప్రూఫ్ ఉంటే సమస్య ఎలా వచ్చింది? అసైన్డ్ పట్టా భూములు తెలియకుండానే రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు అంగీకరించారు. యజమానులకు తెలియకుండా 9,200 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు మా దగ్గర సమాచారం ఉంది. నిషేధిత జాబితా నుంచి ఎప్పటిలోగా తొలగిస్తారన్నది ప్రజలకు చెప్పాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ముద్ర, కరీంనగర్ : మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కరీంనగర్ మండలం చింతకుంటకు చెందిన పైడిపల్లి వెంకటేశ్వర్లు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. గోదావరిఖని పవర్‌హౌజ్ కాలనీకి చెందిన గుండ సరిత(35) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా ఇరువురికి పరిచయం ఏర్పడింది. వెంకటేశ్వర్లుకు ఇద్దరు సంతానం ఉండగా విడాకులై వేరుగా ఉంటున్నాడు. సరితకు పిల్లలుండగా విడాకుల కోసం దావా దాఖలు చేసి విడిగా ఉంటుంది. దీంతో వీరిద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారు.

సరిత తనకు రూ.20 లక్షలు ఇవ్వాల్సిందిగా వెంకటేశ్వర్లుపై ఒత్తిడి తీసుకొచ్చింది. సరిత ఇతరులతో ఫోనులో సంభాషిస్తుందని, చాటింగ్ చేస్తుందనే అనుమానంతో వెంకటేశ్వర్లు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. దీంతోపాటు రూ.20 లక్షలు ఇవ్వాలని తీవ్ర ఒత్తిడికి గురిచేయగా 2023 జూన్ 28న రాత్రి సరిత తలను గోడకు కొట్టడమేకాకుండా చున్నీతో మెడ చుట్టూ గట్టిగా లాగడంతో చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేయగా సీఐ రవికుమార్ దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు సీడీవో సయ్యద్ సర్వర్ అలీ, సీఎంఎస్ అధికారి యం.సత్తయ్య కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి శివకుమార్ శుక్రవారం పైడిపల్లి వెంకటేశ్వర్లుకు(42) జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

### తల్లిని హత్య చేసిన నిందితుడికి..

తల్లిని హత్య, సోదరుడిపై హత్యాయత్నం చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కరీంనగర్ నాలుగో అదనపు జిల్లా జడ్జి(ఫ్యామిలీ కోర్టు) కవిత తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన ఏగుర్ల లస్మవ్వ పెద్ద కుమారుడు లింగయ్య గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుండేవాడు. తల్లికి ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని చిన్న కుమారుడు రాజు నిర్ణయించగా దీనికి లింగయ్య ఒప్పుకోలేదు. బంధుమిత్రుల సహకారంతో ఇరుకుల్లలో గృహ నిర్మాణం చేసి లస్మవ్వకు ఇవ్వగా అందులో నివాసం ఉంటుంది. గల్ఫ్ నుంచి వచ్చిన లింగయ్య వ్యవసాయ భూమి నుంచి తనకు రావాల్సిన వాటా పంచి ఇవ్వాలని తల్లి, సోదరుడు రాజుపై ఒత్తిడి తీసుకొచ్చి కక్ష పెంచుకున్నాడు. 2022 అక్టోబరు 24న భూమి విషయంపై గొడవపడగా లింగయ్య కోపంతో రోకలితో తల్లిపై దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మరణించింది. సోదరుడు రాజు మీద దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేయగా ఇన్‌స్పెక్టర్ విజ్ఞాన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీడీవో హెడ్‌కానిస్టేబుల్ ఎన్.రాజేందర్, మధుసూదన్, సీఎంఎస్ అధికారి ఆర్.శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున జూలూరి శ్రీరాములు సాక్షులను విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కవిత శుక్రవారం లింగయ్యకు జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధించారు.

## ప్రధాని మోదీని 21 సార్లు కలిశా : చైనా అధ్యక్షుడు

**ముద్ర, ఢిల్లీ :** ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు చర్చలు జరిపారు. అనంతరం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, పరస్పర సహకారంతో ముందుకు సాగవచ్చని అన్నారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామన్నారు.

## బావిలో బాలుడి మృతదేహం గుర్తింపు



**ముద్ర, మల్యాల న్యూస్** : మల్యాల మండలకేంద్రానికి చెందిన గుండేటి కవిత(34) గురువారం తెల్లవారుజామున చిన్న కుమారుడు శశాంక్(7)తో కలిసి ఇంటి నుంచి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. అదే రోజు ముత్యంపేట-గుడిపేట గ్రామాల మధ్య వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. కాగా కుమారుడి మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో అదే బావిలో తేలడంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగారు. సీఐ రాజ్‌కుమార్, ఎస్సై సందీప్ ఘటనా సలాన్ని పరిశీలించి బాలుడి శవాన్ని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లీ కుమారుల మృతదేహాలకు శ్మశానవాటిక సమీపంలో పక్కపక్కనే ఖననం చేశారు. కవితకు పెద్ద కుమారుడు నిఖిలేశ్, శశాంక్‌కు తాత పండిత్ అంతిమ సంస్కారాలు నిర్వహించడం స్థానికుల హృదయాలను బరువెక్కించాయి.

**అప్పులే ప్రాణాలు తీశాయా!**

కవిత ఇతరుల వద్ద తీసుకున్న అప్పులే ఆమెతో పాటు కుమారుడి ప్రాణాలు తీసినట్లు తెలుస్తోంది. ఆమె స్థానిక యువకుడికి రూ.లక్షల్లో బదులుగా ఇచ్చిన డబ్బుల కోసం రెండు రోజుల క్రితం అతడి ఇంటికి వెళ్లి నిలదీసినట్లు సమాచారం. అప్పులు తీర్చడానికి ఇంటిని కూడా విక్రయించాలని గతంలో నిర్ణయించినట్లు తెలిసింది. అప్పులిచ్చినవారి వేధింపులు అధికమైనట్లు సమాచారం. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో పాటు చిన్న కుమారుడి అనారోగ్య సమస్యలు తోడవడంతో జీవితంపై విరక్తితో కుమారుడితో కలిసి కవిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె సోదరుడు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులో కీలక ముందడుగు..

**- పనులు ఇక మిషన్ మోడ్‌లో**
**- ఆదిలాబాద్ JUA ప్రాజెక్టుపై కీలక సమీక్ష**
**- వచ్చే వారంలో నోడల్ ఆఫీసర్ల నియామకం**
**- 1,500 ఎకరాల అదనపు భూసేకరణకు నిర్ణయం**
**- సివిల్ టెర్మినల్‌తో పాటు MRO సదుపాయం**



**ముద్ర, కరీంనగర్** : వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (JUA) ప్రాజెక్టు పురోగతిపై న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మొత్తం ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**మిషన్ మోడ్‌లో పనులు.. నోడల్ ఆఫీసర్ల నియామకం**

ఈ విమానాశ్రయ ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని నిర్ణయించారు. దీనికి తోడు జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (DPR) , మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**దేశ రక్షణకు, రీజనల్ కనెక్టివిటీకి పెద్దపీట**

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో పౌర విమానయాన మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు, దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు ఆదిలాబాద్ వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాంతమని కిషన్ రెడ్డి తెలిపారు. రీజనల్ కనెక్టివిటీ అవసరాన్ని రక్షణ మంత్రికి వివరించగా, ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

**అదనంగా 1,500 ఎకరాల భూసేకరణ**

ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే రక్షణ, పౌర విమానయాన అధికారులు ఆదిలాబాద్ విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రస్తుతం భారత వైమానిక దళం (IAF) వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా తెలంగాణ ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుంది. ఇక్కడ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్స్, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ , మెయింటెనెన్స్ సదుపాయాలను సిద్ధం చేయనున్నారు.

**పౌర సేవలు, ఎంఆర్ఓ సదుపాయాలు**

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI) ఆధ్వర్యంలో ఇక్కడ ఒక ఆధునిక సివిల్ టెర్మినల్‌తో పాటు 'మెయింటెనెన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్' (MRO) ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

వీటితో పాటు అక్కడ విధుల్లో ఉండే ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ఏళ్లుగా చేస్తున్న నిరంతర ప్రయత్నాలు ఇవాళ తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని, ఈ ప్రాజెక్టుతో ఉత్తర తెలంగాణ రూపురేఖలు మారనున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## చిగురుమామిడి పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిట్టుమల్ల రవీందర్

*** చైర్మన్ తోపాటు 12మంది డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించిన అధికారులు..**
*** శుభాకాంక్షలు తెలియజేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,మండల అధ్యక్షుడు అందే సురేష్..**

**ముద్ర చిగురుమామిడి** : చిగురుమామిడి మండల కేంద్రం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)నూతన చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్ శనివారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు.సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఆయనతో పాటు 12మంది నూతన డైరెక్టర్లతో అధికారికంగా ప్రమాణస్వీకారం చేయించారు.చైర్మన్ రవీందర్‌తోపాటు ప్రమాణస్వీకారం చేసిన వారిలో డైరెక్టర్లు చాడ మహిపాల్ రెడ్డి,పోటు మల్లారెడ్డి,చిట్యాల బాల్ రెడ్డి,పచ్చిమట్ల లక్ష్మి, కూతాటి తిరుపతి,శ్రీరామోజు రాజకుమార్,చింతపుల సాయన్న,కనగడ్ల శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, బెజ్జంకి భాగ్య, పిల్లి కొమురయ్య,బొమ్మగాని పరుశురాములు ఉన్నారు.ప్రమాణస్వీకార మహోత్సవం అనంతరం సింగిల్ విండో కార్యాలయంలో నూతన పాలకవర్గానికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్ హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు చింతపుల నరేందర్,అల్లెపు సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు బదుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్,గుళ్ళ రాజు, ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,పూదరి వేణు,ఎనగందుల లక్ష్మణ్, మాచమల్ల రమణయ్య, బోయిని నరేష్,గట్టు ప్రశాంత్, సోషల్ మీడియా మండల కన్వీనర్ జిల్లెల రమేష్, పోతర్ల శివాంజనేయులు,గంగిపెల్లి సురేష్,ఎలగందుల శివకుమార్ తోపాటు పలువురు సహకార సంఘ ప్రతినిధులు,రైతులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శనివారం 11.09.2026

www.mudranews.in | @mudranews




## ప్రూన్స్ కూడా మంచి ఎంపిక



ఎండబెట్టిన రేగిపండ్లు (Prunes) కూడా మలబద్ధకానికి ఉపయోగపడే ఆహారాల్లో ఒకటి. ఒక సిస్టమాటిక్ రివ్యూలో ప్రూన్స్ తీసుకున్నవారిలో మల విసర్జన తరచుదనం, మల సాఫ్ట్‌నెస్ మెరుగుపడినట్లు వెల్లడైంది.

## లోక్ అదాలత్ లో 18523 కేసులు పరిష్కారం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు సూచనలతో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా మూడవ జాతీయ లోక్ ఆదాలత్ ను నిర్వహిస్తున్నట్లు, ఈ లోక్ అదాలత్ లో 8 సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలాన కేసులు మొత్తంగా 2541, 101 పి ఎల్ సి కేసులు, ఇ-చాలాన కేసులు 15873 మొత్తంగా 18523 కేసులు పరిష్కరింబడ్డాయన్నారు. జిల్లా లోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా పోలీసు యంత్రాంగం, కోర్టు సిబ్బంది కృషి చేశారని, కొన్ని కేసులలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా బాదితులను ప్రవేశ పెట్టి కేసులును పరిష్కరించినట్లు తెలిపి నవంబర్ 21వ తేదిన చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత, ఇంచార్జి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మిలింద్ కాంబ్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆరిఫ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి. స్వాతి, రెండవ తరగతి మేజిస్ట్రేట్ జ్యోతిరావు, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. విద్యాసాగర్, కార్యదర్శి యాదగిరి, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ యంత్రాంగం, కక్షిదారులు పాల్గొన్నారు.

## 324 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అక్రమంగా తరలిస్తున్న 324 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు అక్రమ రవాణా, అక్రమ నిల్వలు, ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం దుర్వినియోగంపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు రాజపేట పోలీస్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో, రాజపేట మండలం సింగారం గ్రామం వద్ద అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకున్నారు.లారీని తనిఖీ చేయగా అందులో 324 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. విచారణలో ఈ బియ్యాన్ని పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా దేవి సింగ్ సహాయంతో సిద్దిపేట వైపు అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రాథమికంగా వెల్లడైంది.ఈ ఘటనకు సంబంధించి రాజపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా దేవి సింగ్, గుజరాత్ రాష్ట్రంకు చెందిన మోరీ సమీర్ జేత,కటార ఆవడ బాలును అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా రాజపేట ఎస్ఐ మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా అక్రమ వ్యాపారానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా పంపిణీ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడే వారిపై జిల్లా పోలీస్ శాఖ జీరో టాలరెన్స్ విధానంతో చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.

## తాజ్పూర్ లో హెచ్ పి వి వ్యాక్సిన్ శిబిరం




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని తాజ్పూర్ గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వద్ద శనివారం హెచ్ పి వి వ్యాక్సిన్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల లోపు కిషోర బాలికలు హెచ్ పి వి వైరస్ తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఆరోగ్య వంతమైన జీవితానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పూర్తి అవగాహన తో వారి ఆడపిల్లలకు సూచించిన వయసు పరిమితి లోపు ఈ వ్యాక్సిన్ లు ఇప్పించాలని,మీ పిల్లల ఆరోగ్య వంతమైన జీవితానికి మీ సహకారం ఎంతో అవసరమని సూచించారు. సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, వైద్యాధికారులు కుంటా సురేష్, వైద్య బృందం, ఆశ కార్యకర్త బింగి అరుణ, 14సంవత్సరాలు నిండిన బాలికలు పాల్గొన్నారు.

## యువత పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నేవూరి ధర్మేందర్ రెడ్డి

### ఉచిత పుస్తకాల పంపిణీ



**ముద్ర, మోత్కూర్:** యువత అన్ని రంగాల్లో ముందుంటూ పోటీ పరీక్షలకు పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని తెలంగాణ ఉద్యమనేత, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ నేవూరి ధర్మేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో తెలంగాణ మాదిగ ప్రైవేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సహకారంతో, ఎస్ ఎన్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నేవూరి ధర్మేందర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులను ఉన్నత స్థాయిలో ఉంచాలనే మంచి సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా కానిస్టేబుల్, సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. విద్యార్థులు, యువత సమయాన్ని వృథా చేయకుండా అన్ని రకాల పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలని లక్ష్య సాధన కోసం కృషి చేస్తే విజయం తప్పక లభిస్తుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సామాజిక బాధ్యతతో విద్యార్థులకు చేయూతనందిస్తున్న ఎస్ఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులను, అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీను, నరేష్, రాంబాబు లతో పాటు తెలంగాణ మాదిగ ప్రైవేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, మోత్కూరు,అడ్డగూడూరు మండల అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు కొండ సోంమల్లు,గజ్జి మల్లేష్, బిఆర్ఎస్ వి మండల అధ్యక్షులు పబ్బు ప్రవీణ్, కొంపెల్లి మల్లేష్, బోడిగే మల్లేష్, పొన్నబోయిన మత్స్యగిరి,విద్యార్థులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్ డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 12 :** బైపాస్ రోడ్‌లోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రాపర్తి నగర్ సెంటర్ వరకు చేపట్టిన డ్రైనేజీ ఆధునీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ డిమాండ్ చేశారు. సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో నిలిచిపోయిన సైడ్ డ్రైనేజీ పనులను పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వై. విక్రమ్ మాట్లాడుతూ... గత కొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో పనులు అత్యంత నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ పనుల ఆలస్యం వల్ల వ్యాపార సముదాయాలు, పెట్రోల్ బంకులు, హోటళ్లకు వెళ్లే రహదారులు మూసుకుపోయి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. పనులు పూర్తి కాకపోవడంతో మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోయి ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. నగర కమిషనర్, మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయించి, రహదారుల వెడల్పు, సైడ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బోడపట్ల సుదర్శన్, బత్తిన ఉపేంద్ర, నందిపాటి మనోహర్, జె. వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



**ముద్ర, దేవరకొండ:** ఆర్టీసీ బస్టాండ్లో ఈ ఏడాది మార్చి నుంచి జులై వరకు జరిగిన మూడు దొంగతనాలకు పాల్పడిన అంతరాష్ట్ర దొంగల ముఠాను శనివారం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ రావు వెల్లడించారు. నెల్లూరు జిల్లా జొన్నవాడకు చెందిన సిందె తిరుపతమ్మ, వనరచి కేశవ, వనరచి జ్యోతి అనే వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి బస్టాండ్ తదితర రద్దీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అదే క్రమంలో సదరు మూఠా సభ్యులు శనివారం కొండమల్లేపల్లి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా రుగుతున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారని, అంతేకాకుండా సదరు నిందితులపై తిరుపతి, కావలి, కర్నూల్ జిల్లాలో మూడు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఐదు తులాల బంగారం, ఒక ఆటో, చరవాణిలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నవీన్ కుమార్, ఎస్సె అజ్మీర రమేష్, సిబ్బంది కరుణాకర్, హేమునాయక్, భాస్కర్, రాంబాబు, శేఖర్, నాగ సంధ్యలను డీఎస్పీ అభినందించారు

## అభినవ్ రాజ్ సంస్మరణ సభలో దూదిపాల



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండలోని డిండి రోడ్డులో గల సాయి శివ గార్డెన్‌లో నిర్వహించిన గాజుల రాజేష్ కుమారుడు గాజుల అభినవ్ రాజ్ సంస్మరణ సభలో టీపీసీసీ సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాజుల అభినవ్ రాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అభినవ్ రాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**ముద్ర, మోత్కూర్:** బి ఆర్ఎస్ పార్టీ నాయకులు బి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోక బిక్షం మాతృమూర్తి కోక సోమక్క, మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని బుజిలాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు ఆకుల రవి గౌడ్ తండ్రి ఆకుల లింగయ్య గౌడ్ మరణించడంతో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర మాజీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణ రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆరవ వార్డు ఆరెగూడెం గ్రామానికి చెందిన బద్దం కళమ్మ (65) అనారోగ్యంతో మరణించడంతో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య కళమ్మ పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్దన్ రెడ్డి , సామ పద్మారెడ్డి, గుడెపు పరమేష్, చేడిపెల్లి రఘుపతి, పంజాల మహేందర్, మలిపెద్ది మల్లారెడ్డి, పసునూరి యాదయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 12: జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగ్గ కేసులలో ఇరుపక్షాలు సామరస్యంగా రాజీ పడి సత్వర న్యాయం పొందాలని కోరారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 15 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశామని, ఇక్కడ వెలువడే తీర్పులు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా కావడమే కాకుండా ఇరువర్గాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, వివాదాలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. ఈ సారి 10 వేల కేసులకు పైగా పరిష్కరించడమే లక్ష్యంగా పోలీస్, న్యాయశాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలు కేసుల్లో పరిహార చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 12 :** వేంసూరు మండలం కందుకూరులో కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, కనీసం ఏడు గంటలు కూడా సరిగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వెంకటవీరయ్య మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించి రైతులకు భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వ ముందస్తు ప్రణాళికా లోపం వల్లే మళ్లీ కరెంట్ కోతలు మొదలయ్యాయని, అవసరమైతే వేరే రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసైనా రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌ను పరిశీలించి విద్యుత్ సరఫరా తీరుపై అధికారులను ప్రశ్నించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సండ్ర హెచ్చరించారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 12 :** వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల్లో డీజేలకు అనుమతి ఇవ్వవద్దని, పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని సామాజికవేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్, శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు కోరారు. పెవిలియన్ గ్రౌండ్ ఆవరణలో ఎకో క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ చైతన్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజేల ధ్వని కాలుష్యం వల్ల వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డీజేలకు బదులుగా మండపాల వద్ద భజనలు నిర్వహించడం శ్రేయస్కరమని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ అధ్యక్షులు వి.రామనాథం, 3 హెచ్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు మహమ్మద్ ఖలీల్ పాషా, బొడ్ల నారాయణరావు, ఎడ్ల నాగేశ్వరరావు, మాధవరపు శ్రీరామచంద్రమూర్తి, యం.దామోదర్ రెడ్డి, విజయ్ కుమార్, సొంటి వెంకట్, మంద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో గణేష్ చతుర్థి వేడుకలు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 12:** స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గణేష్ చతుర్థి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమ చిట్టి చేతులతో స్వయంగా మట్టి గణపయ్యలను, వివిధ రకాల ఆకులు, కూరగాయలతో వినాయక ఆకృతులను తయారు చేసి ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే పూజించాలంటూ విద్యార్థులు నగరంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల విగ్రహాల వల్ల జల, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలను మాత్రమే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

ఆదివారం 13.09.2026

www.mudranews.in | @mudranews



## మలబద్ధకానికి కివీ పండు తినండి

మలబద్ధకంతో బాధపడే వారికి కివీ పండు ప్రయోజనకరంగా ఉండొచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇందులో ఉండే ఫైబర్, నీటి శాతం పేగుల పనితీరుకు తోడ్పడి మల విసర్జనను సులభతరం చేయవచ్చు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**డీజేలకు అనుమతి లేదు..**

**రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు**

**ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**మండప నిర్వాహకులతో పోలీసుల సమన్వయ సమావేశం**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. పోలీసు శాఖ ముందస్తు చర్యలలో భాగంగా మెదక్ టౌన్, మెదక్ రూరల్ సర్కిల్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల ఏర్పాటు, భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్యం, నిమజ్జనం తదితర అంశాలపై పోలీసు అధికారులు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని అనుమతి పొందాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలూ కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని, మండపాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఎస్పీ కోరారు. ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా అవసరమైన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర పట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సభ్యులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప అభియాన్ పై బీజేపీ వర్క్‌షాపు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్యక్షతన సేవా సంకల్ప అభియాన్ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత హాజరయ్యారు. ఈనెల 17 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు, తెలంగాణ విమోచన దినోత్సవం నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. బూత్ స్థాయిలో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామరు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను గడప గడపకు తీసుకెళ్లాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సంఘసని సురేష్, శ్రీనివాస్, రాష్ట్ర ఓబీసీ నాయకులు రమేష్ గౌడ్, రాగి రాములు, మోర్చా నాయకులు వడ్ల జనార్దన్, శ్రీనివాస్, మల్లిక, బాలరాజ్, సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, నల్లాల విజయ్, రాజేందర్, శంకర్ గౌడ్, మెదక్ కౌన్సిలర్లు రాజమణి, అఖిల భరత్, వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు నూతన నాయకత్వం

**మూడు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు నూతన అధ్యక్షులు**

**నియామక పత్రాలు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి**



**ముద్ర, చేవెళ్ల:** నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నూతన నాయకత్వాన్ని నియమించారు. ఇటీవల నియమించిన మూడు మున్సిపల్ అధ్యక్షులకు, ఐదు మండలాల అధ్యక్షులకు శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నియామక పత్రాలను అందజేశారు. చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షులు చంద్రమౌళి, చేవెళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, నవాబ్‌పేట్ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, షాబాద్ మండల అధ్యక్షులు పెంటారెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షులు వెంకటరెడ్డిలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, పార్టీకి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు తమ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి, కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల పి ఎస్ ఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు గోపాల్ రెడ్డి, పాండు యాదవ్ పడాల ప్రభాకర్, రవీందర్, టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, చేవెళ్ల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహేశ్వర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశాంత్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ కేబినెట్‌లో విజయశాంతికి ఛాన్స్?

**- ఢిల్లీలో గట్టిగా లాబీయింగ్!**

**దసరా లోపు తెలంగాణ కేబినెట్ విస్తరణకు కసరత్తు..**

**మంత్రి పదవి కోసం పావులు కదుపుతున్న ఎమ్మెల్సీ విజయశాంతి..**

**మహిళ, బీసీ కోటా పేరుతో కొత్త లెక్కలు తెర మీదికి**

**(ముద్ర డెస్క్)**



తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ కోసం ఆ నాయకురాలు గట్టిగా లాబీయింగ్ చేస్తున్నారా? ఏఐసీసీ లెవల్‌లో తనకున్న పలుకుబడి మొత్తాన్ని వాడేస్తున్నారా? ఉన్న పరిస్థితులు, ఈక్వేషన్స్‌ని తనకు అనుకూలంగా మలుచుకుంటూ--- కన్విన్సింగ్‌గా లెక్కలు చెబుతున్నారా? ఎవరా నాయకురాలు? ఆమె గురించి రాష్ట్ర పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఏంటి? ఆల్రెడీ ఇచ్చిన పదవి మీదే పెదవి విరుపులు ఉంటే.. ఇప్పుడు మరోటా అన్న మాటలు ఎందుకు వినిపిస్తున్నాయి? తెలంగాణ కేబినెట్ విస్తరణ అంశం మళ్ళీ తెర మీదికి వచ్చింది. అదిక ఎంతో దూరం లేదు, గుమ్మం ముందుకు వచ్చేసినట్టేనని చెబుతున్నారు. ప్రభుత్వ పెద్దలకు ప్రస్తుతం ఉన్న ఆలోచనలు, మిగతా వ్యవహారాలన్నీ అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే---దసరా పండగ లోపే మంత్రివర్గ విస్తరణ ప్రక్రియను పూర్తిచేయాలనుకుంటున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి, పార్టీ ముఖ్యుల ఇటీవలి ఢిల్లీ పర్యటన సందర్భంగా జరిగిన చర్చల్లో విస్తరణ వ్యవహారం కాస్త కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో.. ఇటు కాంగ్రెస్, అటు రాజకీయ వర్గాల్లో రకరకాల అంచనాలు, విశ్లేషణలు మొదలయ్యాయి. మరోవైపు బీసీ మహిళ--- కొండా సురేఖను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయడంతో, ఆ స్థానంలో--- రెండు ఈక్వేషన్స్ కలిసి వచ్చేలా ఎమ్మెల్సీ విజయశాంతి పావులు కదుపుతున్నట్టు చెప్పుకుంటున్నారు. మహిళ, బీసీ కోటా రెండూ తనకు కలిసి వస్తాయిగనుక---. తనకో అవకాశం ఇవ్వాలంటూ విజయశాంతి ఢిల్లీ పరిచయాలతో లాబీయింగ్ నడిపిస్తున్నారన్నది కాంగ్రెస్ ఇంటర్నల్ టాక్. గతంలోనే.. అసలు రాష్ట్ర నాయకత్వంతో సంబంధం లేకుండా--- ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్నారామె. ఆ కోణంలోనే.. ఇప్పుడు కూడా అధిష్టానాన్నే నమ్ముకుని అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. బీసీ మహిళను క్యాబినెట్ నుంచి తప్పించారు కాబట్టి.. అదే కోటాలో తనకు మంత్రి పదవి కావాలంటూ గట్టి ప్రయత్నాలే చేస్తున్నారట విజయశాంతి. అందులో భాగంగా ఏఐసీసీలో తనకున్న పలుకుబడి మొత్తాన్ని ఉపయోగిస్తున్నట్టు చెబుతున్నాయి పార్టీ వర్గాలు. అయితే విజయశాంతి ఎపిసోడ్ పై సొంత పార్టీ నేతల్లోనే భిన్న వాదనలు ఉన్నాయి. ఆమె తన పలుకుబడి ఉపయోగించి--- అధిష్టానాన్ని మెప్పించి ఎమ్మెల్సీ పదవి అయితే తీసుకున్నారుగానీ---. ఆ హోదాలో పార్టీకి ఏమాత్రం ఉపయోగపడలేదన్న వాదనలు గాంధీభవన్‌లో ఉన్నాయి. తాను ఎమ్మెల్సీ అయ్యాక--- పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారామె. సభ్యురాలిగా శాసనమండలికి రావడం తప్ప---. ఏ ఒక్క ఎన్నికలో కూడా పార్టీ కోసం నిలబడి, ప్రచారం చేసిన దాఖలాలు లేవన్న చర్చ ప్రధానంగా జరుగుతోంది. పార్టీ కోసం పని చేసిన వాళ్లని కాదని అధిష్టానం కూడా అంచనాల పరంగా తప్పటడుగులు వేస్తోందని ఓ సీనియర్ నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అంటోంది హస్తం కేడర్. అసలు విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం పైనే అభ్యంతరాలు వ్యక్తమైన వాతావరణంలో ఇప్పుడిక మంత్రి పదవి కూడా ఇస్తే---. పరిస్థితులు ఎలా మారతాయోనన్న డిస్కషన్ సైతం నడుస్తోంది కాంగ్రెస్ వర్గాల్లో. కేబినెట్‌లోకి ఎవర్ని తీసుకోవాలన్న పూర్తి నిర్ణయాధికారం ముఖ్యమంత్రికే ఉంటుంది. దీంతో---ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని ఉత్కంఠగా చూస్తున్నారు కాంగ్రెస్ లీడర్స్. ఎమ్మెల్సీ అయ్యాక కూడా--- విజయశాంతి ఒకటి రెండు సందర్భాల్లో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం, ట్వీట్స్ చేయడం లాంటివి జరిగాయి. అలాంటి నేతను మంత్రివర్గంలోకి తీసుకుంటే--- తలనొప్పులు తప్పవంటూ పార్టీ సీనియర్స్ కొందరు గట్టిగా వాదిస్తున్నారు. ఇలాంటి రకరకాల చర్చలు, అనుమానాల నడుమ తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి పెరుగుతోంది.

## జిల్లా వ్యాప్తంగా 6351 కేసులు పరిష్కారం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. నీలిమ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులతోపాటు నర్సాపూర్, అల్లాదుర్గ్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం ఐదు బెంచ్ లు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 6351 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రాజీ పడడంతో ఇరువురికి న్యాయం జరుగుతుందన్నారు. ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.ఎం.సుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సిరి సౌజన్య, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి ప్రభాకర్, అన్ని కోర్టుల సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన అదనపు కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్ డేలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ శనివారం కుల్చారం లలమండలంలోని పోతంశెట్టిపల్లి, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కు కృతజ్ఞతలు

**సర్పంచుల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు.**



**ముద్ర, చేవెళ్ళ:** రాష్ట్ర సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను శనివారం రంగారెడ్డి జిల్లా మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు తిప్పని మాధవి రామ్ రెడ్డి కలిశారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతగా ఆమె సన్మానం చేశారు. శాలువాతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 70, సబ్‌సెక్షన్ (3) ప్రకారం గ్రామ పంచాయతీల నిధులను ట్రెజరీలో కాకుండా నేరుగా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ ఇటీవల, సెప్టెంబర్ 10, 2026న అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం కీలక సవరణ చేయడం పట్ల రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌ల సంఘం తరపున ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్యకు రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌ల సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

## గేదెకు కవల దూడలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** గేదె కవల ఆడ దూడలకు జన్మనిచ్చిన సంఘటన హవెలి ఘనపూర్ మండలం ముత్తాయికోట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మంగ సిద్దిరాములు ఇంట్లో గేదె ఈనగా దూడలు జన్మించాయి. అరుదుగా పుడతాయని లైవ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీరామ్ నవీన్ తెలిపారు. కవల దూడలు చూసేందుకు గ్రామస్తులు తరలి వస్తున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555